www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 జనవరి 2024
5
కాకినాడ



సిఐఎస్‌సి అకాడమీతో ఆదిత్య ఒప్పందం

ప్రజాశక్తి-గండేపల్లి

విశాఖపట్నంకు చెందిన సిఐఎస్‌సి అకాడమీతో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐఎస్‌సి అకాడమీ సలహాదారు వై.రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అవగాహన పత్రాలను మార్చుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, సాంకేతిక మీద సి-డాక్, ఐఐఐటి ద్వారా ఎస్‌సి, ఎస్‌టిల విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటుగా, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, నీలిట్ ద్వారా 3డి ప్రింటింగ్, రోబోటిక్ ప్రోసెసింగ్ మీద, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని కన్సల్టెంట్ వై.రామ్మోహన్ రావు చెప్పారు. డాక్టర్ పుల్లెల్ల ఎస్‌వివిఎస్‌ఆర్.కుమార్, ఎం.మధు పాల్గొన్నారు.

సిఎం గారూ.. ఇవీ సమస్యలు..

- స్మార్ట్ సిటీ నిధుల విడుదల నిల్
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణేదీ
- దారుణంగా రహదారులు
- నేడు కాకినాడకు సిఎం జగన్



ఆధునీకరణకు ఎదురుచూస్తున్న ఏలేరు ప్రాజెక్టు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికలు మూడు నెలలు గడువు ఉండగా మరోసారి సిఎం వైఎస్.జగన్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపులో భాగంగా బుధవారం కాకినాడలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరవుతున్నారు. వైసిపి పాలన మొదలై నాలుగేళ్ల 9 నెలలు కావస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం పరిష్కరిస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులను ఏళ్ల తరబడి విడుదల చేయడం లేదు. సుమారు రూ.180 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. దీంతో పలు అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. త్వరితగతిన మిగిలిపోయిన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయాలని నగరవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఏలేరు ఆధునికరణకు ఎదురుచూపులు

ఏలేరు ప్రాజెక్టు సాగు నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని దాదాపు 53 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. 40 వేల మంది రైతులు ఆధారపడిన ఏలేరు ఆధునీకరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫేజ్-2లో మిగిలిన 40 శాతం పనులు పూర్తికి రూ.394 కోట్ల నిధులతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏటా ఈ ఆయకట్టు కింద రైతులు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వైసిపి పాలన మరో మూడు నెలల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఈసారైనా తమ సమస్యలను పరిష్కరించాలని రైతాంగం కోరుతోంది. మరోవైపు గత టిడిపి ప్రభుత్వం రూ.160 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినా సుద్దగడ్డ ఆధునీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పనులు ముందుకు సాగడం లేదు. సుద్దగడ్డ కాలువ ఆధునీకరణ జరిగితే గొల్లప్రోలు, ప్రత్తిపాడు మండలాల్లో సుమారు 25వేల ఎకరాల పంటలు సాగునీరు పుష్కలంగా అందడమే కాక ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



కోటిపల్లి-నర్సాపురం రైల్వే పనులు కోసం వేసిన పిల్లర్లు

దారుణంగా రహదారులు

జిల్లాలో ప్రధాన రహదారుల దుస్థితి దారుణంగా మారింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1997 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆర్ అండ్ బి శాఖ రాష్ట్ర రోడ్లు, సుమారు 3 వేల కిలోమీటర్ల మేర జిల్లా రోడ్లు ఉండగా 50 శాతం వరకూ దెబ్బతిన్నాయి. వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వందల మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వేలాది గాయాల పాలవుతున్నారు. ప్రధానంగా కాకినాడ-రాజమండ్రి ఎడిబి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. సుమారు 60 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ రోడ్డులో ఎక్కడ చూసినా మోకాల్లోతు గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. పిఠాపురం-సామర్లకోట మధ్య రోడ్డుతో పాటు మండపేట వెళ్లే రహదారి, సామర్లకోట నుంచి ద్రాక్షారామ మీదగా ధవళేశ్వరం వైపు వెళ్లే రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారుల ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు నిధులు నిల్

కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల 21 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రం అరకొర నిధులను మాత్రమే విడుదల చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విదల్చడం లేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల చిరకాల వాంఛ నెరవేరాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తన వాటా నిధులు ఇవ్వడంతో బాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిఎం వైఎస్.జగన్ నిధుల విడుదలపై ప్రకటన చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

పడకేసిన పర్యాటకం

కోరంగి మడ అడవులు, హోప్ ఐలాండ్ కాకినాడ, ఎస్.యానాం, ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాలు ఇలా అనేక పర్యాటక ప్రదేశాలు ఉమ్మడి జిల్లాకు సొంతం. కానీ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించిన పాపాన పోవడం లేదు. కాకినాడ బీచ్ అభివృద్ధి నిలిచిపోయింది. జిల్లా పర్యాటకాభివృద్ధిపై గంపెడు ఆశలతో ఉన్న ప్రజలకు జగన్ పర్యటన ద్వారా ఊరట లభిస్తుందని ప్రజాప్రతినిధులు ఆశిస్తున్నారు.

సబ్ ప్లాన్ గ్రామాలను గాలికొదిలేసిన సర్కారు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న 56 సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని అనేకేళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నా జగన్ సర్కారు పట్టించుకోవడం లేదు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు లేక ఇక్కడి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గిరిజనుల హక్కులు పూర్తిగా అణిచి వేయబడుతున్నాయి. ఇప్పటికైనా సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయకపోతే వైసిపి ప్రభుత్వానికి తీవ్ర ప్రతిఘటన తప్పేలా లేదు. సిపిఎం ఆధ్వర్యాన అనేకసార్లు ఆందోళనలు చేసినా, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

5లోగా అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి

ప్రజాశక్తి-కాకినాడ

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరాలని లేకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ స్థాయిల్లో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు జరిపిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించిందన్నారు. ఆ మేరకు ప్రభుత్వం జిఒలు జారీ చేసిందన్నారు. అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు, నిర్వహణ ఛార్జీలు విడుదల చేసిందన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 ప్రకారం గర్భిణులు, బాలింతలు, ఆరెళ్ల బిడ్డలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి అన్నారు. సమ్మె వల్ల పోషకాహార కిట్‌లు, టిహెచ్‌ఆర్, గుడ్లు, పాలు, పంపిణీ ఆగిపోయిందన్నారు. ఈ అంశాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో సేవలను కొనసాగించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావడం లేదన్నారు. జిల్లా పరిపాలన అధికారిగా అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉందని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ నెల 5లోగా 2024 లోగా విధులకు హాజరు కాకుండే నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఉరితాళ్లతో నిరసన తెలుతపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఉరితాళ్లతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మెడకు ఉరి తాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.చంటిబాబు, సత్య నాగమణి మాట్లాడారు. విద్యా శాఖలో సమగ్రశిక్ష ఉద్యోగులను విలీనం చేసి మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని, పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సర్వ శిక్ష ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పాఠశాలలను అందంగా తీర్చిదిద్దేందుకు పి.గన్నవరం మండలంలో ఆర్ట్ టీచర్లు అప్పులు చేసి పూర్తిచేసిన వాల్ ఆర్ట్స్‌కు ఇవ్వాల్సిన రూ.4 లక్షలు బకాయిలను సైతం పెండింగ్‌లో పెట్టారని, నాడు-నేడు పథకాల విజయాన్ని ప్రభుత్వ ఖాతాలో వేసుకుంటూ ఉద్యోగులను విస్మరించడం అన్యాయం అన్నారు. ఈ ఆందోళనలో ఎ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

ముఖ్యమంత్రి వైఎస్.జగన మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు మంగళవారం సమీక్షించారు. బుధవారం ఉదయం సిఎం జగన్ కాకినాడ రానున్న నేపథ్యంలో చేపట్టనున్న ఏర్పాట్లపై అధికారులతో సమావేశమయ్యారు. తొలుత బహిరంగ సభ జరిగే ఆర్‌ఎంసి గ్రౌండ్స్‌ను నగరపాలక సంస్థ అధికారులు, జిల్లాస్థాయి ప్రత్యేకాధికారులతో కలిసి పరిశీలించారు. సభకు హాజరయ్యే పింఛన్‌దారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలకు కల్పించిన సదుపాయాలను పర్యవేక్షించారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యంతో పాటు ఇతర ఏర్పాట్లకు సంబంధించి అక్కడ ఉన్న ఆయా విభాగాధిపతులకు సూచనలు ఇచ్చారు. హెలిప్యాడ్ నుంచి ఆర్‌ఎంసి గ్రౌండ్స్ వరకూ జరిగే రోడ్‌షోపై కూడా ఆయన అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రత్యేకాధికారులు, కార్పొరేషన్ యంత్రాంగంతో సమావేశమై చర్చించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఇ సత్యకుమారి, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, డిసిపి హరిదాసు, ఇఇలు మాధవి, వెంకట్రావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

వ్యాధిగ్రస్త బాలలకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధిగ్రస్త బాలలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ విదేశాల్లో పని చేస్తున్న మానవ హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు రాణి సహకారంతో మహిళా ప్రతినిధి కాశి చంద్రావతి ప్రోత్సాహంతో ఈ కిట్లు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి బాలలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్య కుమారి మాట్లాడుతూ హెచ్ఐవి పిల్లలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తున్న మానవ హక్కుల సంఘం సేవలను అభినందించారు. కుంచే నానిబాబు, జుత్తిక అప్పారావు, ఎండి వలీబాషా, ఐసిటిసి కౌన్సిలర్ బి.శ్రీనివాస్, రమాదేవి, సాయి, శ్వేత సుగంధం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల అందజేత

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక శాఖా గ్రంథాలయం గాంధీనగర్ (వివేకానంద పార్క్)నకు కె.సత్యనారాయణ విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ సౌజన్యంతో 25 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా కె.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం కుర్చీలను బహూకరిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయాలు పాఠకులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడానికి ముందుకు రావాలని చెప్పారు. గ్రంథాలయాలఉపయోగాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతల సౌజన్యంతో ఈ గ్రంథాలయాన్ని బాగా అభివద్ధి చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్‌ఎన్ఎస్‌వి.ప్రసాద్ కుర్చిలను ఇచ్చిన దాతకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవిఎస్.రామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక శక్తిని అభివృద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఈనాడు చిన్నపిల్లల నుండి వద్దుల వరకు అనేక ఒత్తిళ్లు నెలకొనడంతో మానసిక ప్రశాంతత కోసం తహతహతలాడతారని దీని నివారణకు మానసిక శక్తిని అభివద్ధి చేసుకోవాలని ఓమ్ శాంతి ప్రతినిధి రజిని పేర్కొన్నారు. స్థానిక శాంతి వనంలో శ్రీ విశ్వ కాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ఆమె మాట్లాడారు. అడబాల స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.




డాక్టర్ గోపీనాథ్‌ను అభినందిస్తున్న సభ్యులు

రోటరీ గోల్డ్ అధ్యక్షునిగా గోపీనాథ్

ప్రజాశక్తి-కాకినాడ

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ 2025-26 సంవత్సరానికి నూతన అధ్యక్షునిగా వంశీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ గోపీనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ ప్రకటించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో అధ్యక్షునిగా ఎన్నికైన గోపీనాథ్‌కు ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎస్.శ్రీకాంత్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల్లో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ గోపి మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన గోల్డెన్ జూబ్లి క్లబ్‌కు అధ్యక్షులుగా ఎంపిక చేసిన క్లబ్ కార్యవర్గంతో పాటు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ ప్రతిష్ఠను మరింతగా పెంపొందించేందుకు సభ్యులందరి భాగస్వామ్యంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చందు, కోశాధికారి పవన్, అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, సత్తి రవి రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపల్ కార్మికులు బుధవారం నుంచి సమ్మె బాట పడుతున్నట్లు మున్సిపల్ రెగ్యులర్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొత్స శ్రీను, గౌరవాధ్యక్షుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.కిషోర్, తదితరులు చెప్పారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సిఎం జగన్మోహన్ రెడ్డి గతంలో తమకు ఇచ్చిన హామీలు అమలు జరపక మాట తప్పిన కారణంగా సమ్మెకు దిగడం తప్పడం లేదన్నారు. ఒకవైపు జనాభాకు అనుగుణంగా సిబ్బంది పెరగడం లేదని తమపై పని భారం ఎక్కువగా ఉందని చెప్పారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది, స్కిల్, సెమీ స్కిల్డ్, హైస్కూల్ డ్రైవర్స్, స్కూల్స్ స్వీపర్స్, టాయిలెట్ వర్కర్స్‌కు జీతాలు పెంచాలని, పండుగ జాతీయ సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి లక్ష్మి, మిర్యాల పెద్ద, కామిరెడ్డి బోడకొండ, చెన్నా వెంకటేశ్వర్లు, చిడతా వరలక్ష్మి, కసింకోట ఆనందరావు, సింగంపల్లి అప్పారావు, బంగారు వెంకన్న పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిల్చొని నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి సమాన పనికి సమాన వేతనం ఇస్తానని మున్సిపల్ కార్మికులకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తన హామీని అమలు చేయడం లేదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే పోటీ కార్మికులను రంగంలోకి దింపి కార్మికుల మధ్య వివాదాలు రగిలించటం అన్యాయమన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించ ాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకోటి అప్పారావు, వర్రే గిరిబాబు, భూపతి శ్రీను, మడికి కృష్ణ, చేపల అర్జియ్య, వర్రే రాజేష్, ముత్యాల దుర్గ, వర్రే కుమారి, పెదారి గంగాభవాని, వెంకటలక్ష్మి, సత్యవతి, వర్రె నాగదేవి, మడికి మోహన్ రావు, దోనం దేవ ప్రసాద్, దొండపాటి సురేష్, దొండపాటి శేఖర్, ఆర్ సురేష్, శ్రీకాంత్, వర్రె రమణ, పలివెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో దువ్వా శేషబాబ్జి



గొల్లప్రోలులో..

పిఠాపురం (గొల్లప్రోలు) తమ సమస్యల పరిష్కారం కోసం నగర శానిటేషన్ వర్కర్లు చేస్తున్న సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.చిన్న, నందీశ్వరరావు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.రమణ మాట్లాడారు. శానిటేషన్ వర్కర్స్ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి కనీస వేతనం అమలు చేయాలని రిటర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు బి.సతీష్, జి.రాజులు, సిహెచ్.రాజమోహన్, రావులమ్మ, పార్వతి పాల్గొన్నారు.

అభివృద్ధి, సమస్యలపై సిఎం హామీ ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

చాలా కాలం తర్వాత సిఎం జగన్ బుధవారం కాకినాడ వస్తున్న నేపథ్యంలో కాకినాడ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నిర్దిష్టంగా, స్పష్టమైన హామీలు ఇవ్వాలనిసిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు కె.సత్తిరాజు, మలకా వెంకట రమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి మాట్లాడారు. నగర పాలక సంస్థ పాలకవర్గం గడువు ముగిసి చాలాకాలం అయ్యిందన్నారు. పాలకవర్గం లేకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు నగర పాలక సంస్థకు జమకావడం లేదన్నారు. కార్పొరేటర్లు లేక ప్రజా సమస్యల పరిష్కారం అంతంతమాత్రంగా ఉంటోందన్నారు. అందువల్ల తక్షణమే కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలు నిర్వహించాలనఆనరు. ఏళ్ళతరబడి గ్రామాల విలీనం జరగలేదని, ఆయా గ్రామాల్లో కూడా పంచాయతీ ఎన్నికలు జరగడం లేదన్నారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం సక్రమంగా చెల్లించాలన్నారు. పెరుగుతున్న జనాబాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచాలని, నగరంలో డంపింగ్ యార్డ్, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని, కాకినాడను వివిధ ప్రాంతాలను కలిపే 5 రోడ్లను అభివృద్ధి చేయాలని, కాకినాడ - పిఠాపురం రైల్వే మెయిన్ లైన్ కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. నగరంలో టిడ్కో ఇళ్ళను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని, జగనన్న కాలనీలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.



మొక్కలు నాటుతున్న సూర్యనారాయణ దంపతులు

విస్తృతంగా లయన్స్ క్లబ్ సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటనల్లో భాగంగా మండలంలో ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత తాళ్లరేవు శ్రీ కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం లయన్స్ సభ్యురాలు గూడాల విక్టోరియా, పిల్లల ఆర్థిక సాయంతో 300 మందికి పైగా దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. లయన్ కొప్పిశెట్టి ఈశ్వరరావు సహకారంతో రిలయన్స్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లోని వికలాంగులకు, తాళ్ళరేవు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డయాబెటిక్ పేషంట్స్‌కు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం తాళ్ళరేవు లయన్స్ క్లబ్ హాల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ దంపతులు వేలూరి సూర్యనారాయణ, సత్యవతి, చోడే శ్రీనివాసరావు, కాళే వీర్రాజు, జి.సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, ధూలిపూడి బాబీ, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, వైదాడి ధర్మారావు, కట్టా ఆదినారాయణ, టి.కృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కరపలో రెండో విడత జగనన్న సురక్ష

ప్రజాశక్తి -కరప

కరపలో చిరంజీవి కల్యాణం మండపంలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఎంపిపి శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, గ్రామ సర్పంచ్ సాదె ఆశాజ్యోతి కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ నరసింహ నాయక్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మొదట విడతలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రోగులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి భీమన్న, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, మద్దూరి భాస్కర్, భోగి రెడ్డి సూర్యనారాయణ సిబ్బంది పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



పోలీసుల అదుపులో నిందితుడు

ఎసిబి అధికారి పేరుతో మోసం : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

ఎసిబి ధికారినని రూ.3,05,000 నగదు కాజేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డిఎస్‌పి. టిఎస్ఆర్‌కె. ప్రసాద్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నిందితుడు రాచంపల్లి శ్రీనివాసులు అనంతపురం జిల్లాలోని పట్నం మండలంలోని మల్లికవేలను గ్రామానికి చెందిన వాడన్నారు. ఇతను గత 15 సంవత్సరాలుగా దొంగతనాలు, స్నాచింగ్, మోసం, దోపిడీ తదితర నేరాలకు పాల్పడుతున్నాడని ఇతనిపై ఆంధ్రా, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలలో 100 కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇతను ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ ఎసిబి అధికారులమని ఫోన్ చేసి వారిని భయభ్రాంతులకు గురి చేసి వారి వద్ద నుండి డబ్బులును దోచుకుంటాడని పదవి విరమణ కాబోతున్న ఉద్యోగులను ఎంచుకుని వారిని బెదిరించి డబ్బులు గుంజుకుంటాడన్నారు. డైలీ హంట్ యాప్ ద్వారా తమ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎఎస్ఐ వెంకటేశ్వరరావుకు ఎసిబి అధికారినని ఫోన్ చేసి నగదు కాజేశాడన్నారు. ఎఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిఐ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ బి.శివకష్ణ, సిబ్బంది నక్కా నారాయణ, దోనిపాటి రవికిషోర్, పి. గంగరాజు టీమ్ ఏర్పాటుచేసి నిందితుడు చేసిన ఫోన్ కాల్ సమాచారంతో బెంగుళూరులోఉన్నట్లు గుర్తించారన్నారు. అక్కడకు వెళ్లి నిందితుడి సమాచారం సేకరించి నిందితుడు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ దగ్గర వున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని రూ.2,10,000 రికవరీ చేశారన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని అభినందిచారు.

పంచాయతీ సిబ్బందిపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్న పంచాయతీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. ఆత్రేయపురం గ్రామ సచివాలయంలో సబార్డినేట్ పనిచేస్తున్న వికలాంగుడు జివివి.సత్యనారాయణ విధి నిర్వహణలో భాగంగా మంగళవారం స్థానిక చిన్న పేటలో శానిటేషన్ నిర్మూలన లో భాగంగా డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పూడిక తీసిన మట్టి వ్యర్థాలను రోడ్డుమీద వేయడంతో చెంతనే ఉన్న ఆటో మీద పడ్డాయి. బండి దిలీప్ అనే వ్యక్తి నా ఆటో పై డ్రైనేజీ వ్యర్థాలను ఎందుకు వేశారంటూ సత్యనారాయణ తో గొడవ పడి దుర్భాషలాడి కర్రతో కొట్టి గాయపరిచాడు. ఈ విషయాన్ని పంచాయతీ ఆఫీసుకు తెలియపరచడంతో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అక్కడ చేరుకునే లోపే డిజిటల్ అసిస్టెంట్ చింత సాయిరాంను, సత్యనారాయణను బండి దిలీప్, రవికుమార్, వినయ్, పమ్మి రాజ్ కుమార్, పమ్మీ బేబీ అయిదుగురు కలిసి దుర్భాషలాడి కర్రలతో కొట్టి గాయపరిచారు. దీనిపై కేసు నమోదు చేశామ ఎస్ఐ బివై .కిరణ్ కుమార్ తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట మండలం జె.కొత్తూరులో మంగళవారం స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తన సిబ్బందితో సారా విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కేసుబోయిన వీర్రాజును పది లీటర్ల సారాతో అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట పట్టణ శివారు కందకం ప్రాంతానికి చెందిన చిట్టిరాజు విద్యుత్ స్తంబాల కార్మికునిగా పనులు చేస్తుంటాడు. మంగళవారం సామర్లకోట శివారు ఎడిబి రోడ్డు రాక్ సిరామిక్ సమీపాన వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌పార్మర్ వద్ద మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చిట్టి రాజుకు శరీరం అంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

పేకాట శిబిరంపై దాడి ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక డ్రైవర్స్ కాలని శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.23,140లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

నాటు సారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో మంగళవారం ఎస్ఇబి సిఐ విటివివి సత్యనారాయణ సిబ్బంది కలసి నాటు సారా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కలవలపల్లి గ్రామానికి చెందిన ఎం.సుబ్బలక్ష్మి నాటుసారా విక్రయించేందుకు నిల్వ చేసిన 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్ఐ జి.బసంతి సిబ్బంది పాల్గొన్నారు.

దున్నపోతులకు అంగన్‌వాడీల వినతి

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. దున్నపోతులకు వినతిపత్రాలు ఇస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సమ్మె శిబిరాన్ని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయట్లేదని గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి తమ నిరసన తెలియజేస్తున్నామని, సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా దిగిరావాలన్నారు. జి.రమణమ్మ, నీరజ, జ్యోతి, విజయ, మున్ని, సరోజ పాల్గొన్నారు.

తాళ్లరేవు అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. వర్కర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ఆదిలక్ష్మి, పార్వతి, కె.ఉషారాణి, అరుణ, శ్రీదేవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కిర్లంపూడి కిర్లంపూడి నుంచి ర్యాలీగా వెళ్లి చిల్లంగిలో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో రత్నం, పి.సావిత్రి, షేక్ పర్వీన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం పాల్గొన్నారు.

ఏలేశ్వరం తహశీల్దారు కార్యాలయం వద్ద సమ్మె శిబిరానికి పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు గంగాభవాని మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కాకరపల్లి సునీత, ఎన్.అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం, ఆర్.రత్నకుమారి, పి.దుర్గాసూర్యకుమారి, కె.రమ్య, పి.గంగాభవాని, కె.బంగారుపాప పాల్గొన్నారు.

కరప దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, ఆశారత్నం, కల్పలత, హెల్పర్ సత్యా మాధవి. ఎంభవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజిని, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఎ.దేవి, బి.మనోజ, లక్ష్మి, సాయి దుర్గ, బి.భవాని పాల్గొన్నారు.

పెదపూడి ఎం.రాజేశ్వరి ఆధ్వర్యంలో సమ్మె శిబిరం వద్ద దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అంగన్వాడీ హెల్పర్ రామలక్ష్మి కుమారుడు సాయికిరణ్ 150 ఆహారపు పొట్లాలను సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలకు అందజేశారు. సాయికిరణ్ మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు గర్భిణులకు సేవ చేస్తున్న అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపు సాయి నాగలక్ష్మి, బాపిరత్నం, సత్యవతి, సూర్య కళ, కనకదుర్గ, మేరీ రత్నం, సాయి లక్ష్మి, గీతారాణి, శ్యామల బాంధవి, శాంతమ్మ పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్ సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేష బాబ్జీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద బైఠాయింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, గ్రాడ్యూటీ పెంచాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌పిఐ నాయకులు పులి ప్రసాద్, జుత్తుక నాగేశ్వరావు, మురారి రవికుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు తోలేటి సూర్యనారాయణ, ఎం.మల్లేశ్వరరావు, వెంకట శాస్త్రి సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్వాడీలు సుజాత, రత్నం, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు అంగన్వాడీలపై నిర్లక్ష్యం తగదని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టుదలకు పోయి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. అంగన్వాడీ ఆయాలు వర్కర్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తున్నారని, అనేక రకాల పనులకు ప్రభుత్వం పయోగించుకుంటుందని, కానీ తెలంగాణలో ఇస్తున్న జీతం కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం, హనుమావతి, వరలక్ష్మి, కాదా సుజాత, పత్తి ప్రసన్న, సలాది లక్ష్మి, సునీత, భవాని, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

పిఠాపురం దున్నపోతుకి వినతిపత్రం ఇచ్చారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి బి.తులసీదేవి, విజయశాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చిన్న, నందీశ్వరరావు, ప్రజావాణి, సత్యవతి, వెంకటలక్ష్మి, భవాని, నళిని, అమల తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తూ నిరసన చేపట్టారు. శిబిరంలో దీక్ష చేపట్టిన పారుపాక-1 అంగన్వాడీ సహాయకురాలు శ్రీలక్ష్మి అస్వస్థతకు గురయ్యారు.





తాళ్లరేవులో..



జగ్గంపేట రూరల్‌లో..



ఏలేశ్వరంలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున ఆశా వర్కర్లు

వైసిపి ఇన్‌ఛార్జ్‌ల నియామకం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

వచ్చే ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల ఇంచార్జ్‌లను నియమిస్తోంది. తాజాగా మంగళవారం అధిష్ఠానం రెండో జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ మంత్రి, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్, పి.గన్నవరం (ఎస్‌సి) నియోజకవర్గానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పిఠాపురానికి కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేటకు మాజీ మంత్రి తోట నరసింహం, ప్రత్తిపాడుకు మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు, రాజమండ్రి సిటీకి ఎంపీ మార్గాని భరత్, రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను నియమిస్తూ అధిష్ఠానం ప్రకటించింది.

యానాం వార్తలు



బహుమతులు అందుకుంటున్న యానాం నవోదయ విద్యార్థులు

ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో నవోదయకు ద్వితీయం

ప్రజాశక్తి - యానాం

ఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత జవహర్ నవోదయ విద్యాలయాల జాతీయ స్థాయి చిల్డ్రన్స్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్లో స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థినీ విద్యార్థులు చిత్రించిన విజువల్ ఆర్ట్స్ 55 చిత్రపటాలు ప్రదర్శించారన్నారు. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్స్, లక్క బొమ్మలు ప్రదర్శించనున్నట్టు నవోదయ విద్యాలయ సమితి ఢిల్లీ వారు తెలియజేశారన్నారు. విజేతలకు నవోదయ విద్యాలయ కమిషనర్ వినాయక్ గర్గ్, భారత ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ సంజయ్ కుమార్ ద్వారా బహుమతులు ప్రదానం చేశారన్నారు. ఈ మేరకు విద్యార్థులు మణికంఠ, సతీష్, మనోజ్, దుర్గేష్ కళా అధ్యాపకులు వెంకటేశ్వర్లు, లక్క బొమ్మలు తయారీకి సహకరించిన తామరపల్లి వరహాలును అభినందించారు.

5న విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

విద్యుత్ వినియోగదారుల నుంచి జనవరి 5న ఉదయం 10 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు లంక కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్లులు జారీ ఆలస్యం, సవరణ, మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, తక్కువ వోల్టేజ్ అంశాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

నేడు కేంద్ర మంత్రుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖామంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బుధవారం యానాంలో పర్యటించనున్నారని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంటల వరకు సావిత్రి నగర్ ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. కేంద్ర మంత్రులు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి నగర్, గిరియంపేట, మత్స్యకార గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్ కోరారు.

ప్రాధాన్యతా అంశాల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కరప

గురజనాపల్లిలోని జెడ్‌పి పాఠశాలలో ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు తయారు చేసిన 2024 క్యాలెండర్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ మంగళవారం ఆవిష్కరించారు. 2023లో పాఠశాలలో జరిగిన వివిధ విద్యా, క్రీడా, ప్రముఖుల జయంతులు, వర్ధంతులు, ప్రాధాన్యత దినోత్సవాలు, వేడుకలతో కూడిన ఫోటోలతో ఈ క్యాలెండర్‌ను ప్రసాదరావు తయారు చేశారు. ఈ క్యాలెండర్‌ను పరిశీలించడం ద్వారా పాఠశాల పనివిధానం సులభంగా అందరికీ తెలుస్తుందని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వివి.రమణమూర్తి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. అందరం కలిసి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులందరికీ మంచి ఫలితాలు వచ్చే విధంగా బోధనను మరింతగా అందించేందుకు పునరంకితం అవుదామని స్టాఫ్ సెక్రటరీ ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.అర్జున్‌రావు, ఎ.సూర్యనారాయణ, సిహెచ్.పద్మావతి, వి.శోభాకర్, పి.భవాని పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రఖ్యాతి చెందిన శ్రీ భూ సమేత శ్రీ కేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం మంగళవారం ప్రజలతో కిక్కిరిసింది. శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామికి లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజ, ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వందలాదిమంది దంపతులు సామూహిక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేశవ స్వామి దేవస్థానం చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, అర్చకులు పెద్దింటి శ్రావణ్ కుమార్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వేలాది మందికి అన్నదానం నిర్వహించారు.



సామూహిక పూజల్లో పాల్గొన్న దంపతులు

నన్నయలో 3, 4 తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - రాజానగరం

ఈ నెల 3, 4 తేదీల్లో నన్నయ యూనివర్శిటీ ఎంఎస్‌సిఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు విసి ఆచార కె.పద్మ రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాసూటికల్ సంస్థ జివికె బయో సైన్సెస్ ఆర్జన్ లైఫ్ సైన్స్ వారి సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో ప్రస్తుతం ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవ త్సరం చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హు లని అన్నారు. రాతపరీక్ష, ఉత్తీర్ణులైన విద్యా ర్థులకు టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి ఎంపిక చేస్తారని చెప్పారు. ఎంపి కైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని జివికె బయోసైన్సెస్ ఆర్జన్ లైఫ్ సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పి స్తారని అన్నారు. అర్హత కల్గిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి చాగల్లు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు రైల్వే స్టేషన్ పరిధిలోని ట్రాక్ మరమ్మతులు నిమిత్తం నేటి నుంచి నాలుగు రోజులపాటు చాగల్లు రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఉయదం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గేటును మూసివేస్తామని, కావున ప్రయాణికులు ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా క్రీడలు

ప్రజాశక్తి - గోపాలపురం

రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా సంక్రాంతి క్రీడా పోటీలను నిర్వహిం చడం అభినందనీయమని పలు వురు వక్తలు అన్నారు. మండ లంలోని వేలచంతల గూడెం గ్రామంలో సంక్రాంతిని పురష్కరించుకుని ఆర్ అండ్ ఎమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగ ళవారం ఎంఎల్ఎ తలారి వెంక ట్రావు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంక టేశ్వరరావు, గోపాలపురం నియోజక వర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు, సాంప్రదాయాలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించు కోవడం అభినందనీయమని అన్నారు. ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెం ట్‌లో 10 జిల్లాల నుంచి 24 జట్లు, ఈనెల 8, 9,10 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, 12 టీములు పాల్గొంటున్నాయని ఆయన వెల్లడించారు.



మద్యపానంపై ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజలను పాలిస్తారా.. తాగిస్తారా..

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను పాలిస్తుందో లేక ప్రజల చేత మద్యాన్ని తాగిస్తుందో తెలియడం లేదని జిల్లా జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మద్యం మాదకద్రవ్యాల ప్రచార జిల్లా జన విజ్ఞాన ఆధ్వర్యంలో మద్యపాన వ్యతిరేక పోరాట నాయకులు మూలపేట ఎస్ఇజెడ్ గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో డిసెంబర్ 31 పురస్కరించుకుని రూ.వందల కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలతో మందుబాబుల జేబులు కొల్లగొడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోషమ్మ, మేరీ, సుబ్బలక్ష్మి, తలుపులయ్య, డాక్టర్ చంటి మోహరా, ఒ.పాల్ రాజ్, బి.చిన్నబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి -కరప

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అన్నారు. కరప గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 88వ సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

విఒఎల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- తాళ్లరేవు

విఒఎల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం తాళ్లూరు మండలం మహిళా సమాఖ్యలో నిర్వహించారు. అధ్యక్షులుగా కమిడి ఈశ్వరీబాయి, ఉపాధ్యక్షులుగా బళ్ల ఝాన్సీ, కార్యదర్శిగా మోర్త వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా కొక్కిలిగడ్డ నాగమణి, కోశాధికారిగా చెల్లదుర్గ ఎన్నికయ్యారు.. నూతన కార్యవర్గాన్ని మంగామణి, ఉషారాణి, రత్నకుమారి తదితరులు అభినందించారు.

ప్రతిభను చాటేందుకు బాలోత్సవం

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం కార్యక్రమం దోహదం చేస్తుందని సబ్ కలెక్టర్ అశుతోష్ వాత్సవ్ అన్నారు. బాలోత్సవం నిర్వాహకులు సబ్ కలెక్టర్ అశుతోష్ వాత్సవ్‌ను మంగళవారం కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా బాలోత్సవం గోడపత్రికను సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి బాలోత్సవం కార్యక్రమాలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ బాలోత్సవం నిర్వాహణకు గల కారణాలను సబ్ కలెక్టర్‌కు వివరించారు.